



# అదిగో!.. అక్కడిదాకా!

చెల్లూరి సీతారాజేశ్వరరావు!



మధ్యాన్నం రెండు గంటలయింది. మనోరమ అన్నం పెట్టుకోబోతోంది. వీధితలుపు చప్పుడయింది.

ఆనందం!

భర్తని చూసి "ఇప్పుడా రావడం? ఈ నాలుగు రోజులు ఎంత భయపడిపోయానో తెల్సా?" మంచినీళ్ళు యిస్తూ అన్నది.

"అనుకోని టూర్ తగిలింది. హెడ్ ఆఫీసువాళ్ళు నన్నే వెళ్ళమన్నారు. ఏం చెయ్యను చెప్పు.... నిన్ను వదలివుండటం నాకుమాత్రం యిష్టమా?"

ఆనందం ఆమెకోసం తెచ్చిన చీరలు, కాస్మెటిక్స్ బయటికి తీశాడు. "ముందర భోజనానికి లేవండి. బాత్‌రూంలో వున్నాయి నీళ్ళు. తర్వాత చూసుకోవచ్చును" అంది వంట గదిలోకి వెళుతూ.

భోజనాలు అయినాయి. ఆనందం సిగరెట్ కాల్చుకుంటూ మంచంమీద పడుకున్నాడు. మనోరమ తాంబూలం యిస్తున్నది.

"క్యాష్ బ్యాగ్‌లోని డబ్బు బీరువాలో పెట్టు. బోనస్ యిచ్చారు."

మనోరమ లెక్కపెట్టింది. ఆరు వేలు. బీరువాలో పెట్టి అతడి ప్రక్కన వచ్చి కూర్చుంది.

"నీకు ఏమున్నా కావల్సివస్తే కొనుక్కో!" ఆమెను తనవైపు తిప్పుకున్నాడు.

"ఇంకా ఏం కావాలి? లెక్కలేనన్ని చీరలు వున్నాయి. నగలు చక్కటి యిల్లు.. టి. వి. ఫ్రిజ్.... వీటన్నిటికంటే మీ అనురాగం వుంది."

"కావల్సింది మరోటుంది."

"ఏమిటే బాబూ?"

"చక్కటి పాప!"

"ఇప్పుడా?

ఆనందం ఏం వినిపించుకోలేదు. ఆమెను దగ్గరకి లాక్కుని....

అది కాలమాగిన సమయం.

ఆనందం వారం రోజులపాటు యింటి దగ్గరే వున్నాడు. మనోరమకి తృప్తిగా వుంది.

"మనో.... రేపు టూర్‌కి వెళ్ళాలి! త్వరలోనే వచ్చేసాను."

"ఏమిటో బాబూ.... మీరు వెళితే తిరిగి రారనిపిస్తోంది."

ఆనందం వులిక్కిపడ్డాడు. కంగారు పడ్డాడు. "ఛ... ఛ .. అలా బేలగా మాట్లాడకు! నీ అదృష్టంవల్ల నేను బాగానే వుంటాను."

"మీ ఆఫీసు ఫోన్ నెంబర్ ఇవ్వండి. కనీసం మాట్లాడతాను!"

"ఒకచోట వుంటానా మనో! నేనే చేస్తాలే ఎక్కడున్నాచయినా!"

ఉదయమే ఆనందం వెళ్ళిపోయాడు! అన్నీ సదుపాయాలు, డబ్బువున్నా మనోరమకి భర్త దగ్గర లేకపోవడం సంతోషంగా వుండదు

ఆనందం చేసున్నది ఏ వుద్యోగమో తెలీదు. మనోరమ ఒక మధ్యతరగతి బీద గుమస్తా కూతురు. కట్నం ఆమె పెళ్ళికి అవరోధం. ఆనందం పెద్ద వుద్యోగం చేస్తున్నానని, కట్నం లేకుండా ఆమెని పెళ్ళిచేసుకున్నాడు! వారి పెళ్ళయి ఆర్నెల్లయింది!

ఆనందం ప్రారంభంలో సేల్స్‌మన్‌గా పనిచేశాడు. ఆ వుద్యోగం కంపెనీ దివాళా తీయడంతో వూడింది. తల్లీ తండ్రీ ఎవరూ లేరు. మరోటి దొరకలేదు. ఆకలి కేకలు ప్రారంభమయ్యాయి. రైల్వే స్టేషన్‌లోని మంచినీళ్ళు త్రాగుతూ ప్లాట్‌ఫారాలమీద పడుకున్నాడు.

ఓ మధ్యాన్నం ఓ సేట్ రైలు దిగి సూట్‌కేస్ ప్రక్కన పెట్టి క్యాంటీన్‌లో చాయ్ త్రాగుతున్నాడు. ఆనందం చూశాడు. క్యాంటీన్ దగ్గర జనమున్నారు. ఇంతలో మరో రైలు రావడంతో జనం ఎక్కువయ్యారు. ఆనందం ఆ సూట్‌కేస్ పుచ్చుకుని నడిచాడు.

రిక్షా ఎక్కి సూట్‌కేస్ తాళం తీసి చూశాడు! ఏవో కాగితాలు, టవల్.... పన్నెండు వేల రొక్కం కనిపించాయి.

బస్సు ఎక్కాడు. విజయవాడలో దిగాడు! అతడి రూపం మారిపోయింది. ఆకలి వెయ్యడంలేదు. ఖరీదైన సూట్లు వచ్చాయి.

అప్పట్నుంచి బస్ డిపో. రైల్వే స్టేషన్‌లు అతడి పాలిట కల్పతరువులయినాయి! డబ్బు పోగడింది. మనోరమని పెళ్ళి చేసుకున్నాడు! కాని ఆమెకీ చీకటి జీవితం చెప్పలేదు.

పెళ్ళయినప్పటినుంచి అతడి దశ తిరిగింది. పట్టుకున్న ఏ కేసు ఫెయిల్ కావడంలేదు ఎక్కడా పట్టుబడలేదు.

ఇది మనోరమ వచ్చిన వేళావిశేష మనిపిస్తోంది.

రెండు రోజులు పోయాకా ఆనందం ఫోన్ చేశారు. "నేను బాగానే వున్నానండీ. మీరు ఎప్పుడు వస్తారు? మా నాన్నగారు వుత్తరం రాశారు కాకినాడ నుంచి. చెల్లాయి పెళ్ళి కుదిరిందిట. వీలుగా వుంటే మిమ్మల్ని రెండు వేలు సర్దమన్నారు."

"నన్ను అడగడం దేనికి మనో బీరువాలో వున్నాయిగా. పంపించు!"

మనోరమ డి డి ద్వారా పంపుదామనుకుంది. కాని యింటి దగ్గర ఒక్కదానికీ బోరుకొడుతోంది. ఆనందం యింకా

రెండు రోజులదాకా రాడు. తనే పోయి యిచ్చేద్దామని బయలుదేరింది.

బస్ డిపోకి రాగానే కాకినాడ ఎక్స్‌ప్రెస్ దొరికింది ఖాళీగానే వుంది. సూట్‌కేస్ పైన పెట్టి ఎదర సీట్లో కూర్చుంది. రెండింటికి బస్ బయలుదేరింది.

తాడేపల్లిగూడెం రాగానే మనోరమకి తలపోటు ప్రారంభమైంది. టీ త్రాగాలనిపించింది. కాని బస్సు ఆగలేదు. తణుకులో ఆగింది.

మనోరమ క్యాంటీన్‌లోకి వెళ్ళింది. ఆమె వచ్చేసరికి సూట్‌కేస్ లేదు! కండక్టర్‌తో చెప్పింది.

"మీ సామాను మీరే భద్రం చేసుకోవాలమ్మా. దానికి మేం ఏం చేయగలం? రిపోర్టు యివ్వండి!"

ప్రయాణీకులు ప్రశ్నలు గుప్పించారు. వ్యాఖ్యానాలు చేశారు. మనోరమకి కాకినాడ వెళ్ళాలనిపించలేదు. వెళ్ళి ఏం చేయడం? హాండ్‌బ్యాగ్‌లో పదిహేను రూపాయలున్నాయి. విజయవాడ తిరిగి వచ్చింది. రెండు వేలు. బట్టలు పోవడం ఆమెకి బాధగా వుంది.

మర్నాడు మధ్యాన్నం వచ్చాడు ఆనందం. రాగానే చెప్పేసింది- "ఎవడో దొంగ వెధవ పుణ్యం గట్టుకున్నాడండీ.."

"పోనిద్దూ.... వృథాగా తిట్టుకోవడం ఎందుకు? పోతేపోయింది. మనకి ప్రాప్తం లేదు. మళ్ళీ పంపు... ఇదిగో ఈ డబ్బు లోపలపెట్టు" ఆనందం స్నానానికి వెళ్ళిపోయాడు.

అది మాసిన అయిదు రూపాయల కట్ట. ఎర్రదారంతో కట్టబడి వుంది. మనోరమకి అనుమానం వచ్చి కట్ట తీసింది.... కొన్నిటి మీద తన సంతకం వుంది. ఇది తను పోగొట్టుకున్న కట్ట. భర్తకి ఎలావచ్చింది?

వాస్తవానికి మనోరమ సూట్‌కేస్ ఎవడో కొట్టేశాడు. వాడి దగ్గర్నుంచి ఆనందం కొట్టేశాడు. బట్టలు డ్రామా కంపెనివారికి అమ్మి, డబ్బు యింటికి తెచ్చివుంటాడు మనోరమ అనుమానం వల్ల మామూలుగా వుండలేకపోయింది.

రాత్రి భోజనాలదగ్గర కబుర్లలో "మీ ఆఫీసు ఫోన్ నెంబర్ ఎంతండీ?" అంది. ఆనందం ఏదో చెప్పాడు.

మనోరమ భర్త బయటకి వెళ్ళగానే ఆ నెంబర్‌కి ఫోన్ చేసింది.

"హోటల్ మేనేజర్ని ....ఏంకావాలి?"

"అదేమిటి.... హసన్ బ్రదర్స్ ఎక్స్‌పోర్టు కంపెనీ కాదా?"

"సారీ రాంగ్ నెంబర్."

అబద్ధం చెప్పాడు భర్త. అంటే అతడు పనిచేయటం లేదన్నమాట! అయితే ఏం చేస్తున్నాడు? ఇంత డబ్బు ఎలా వస్తోంది?

ఇంతలో ఆమె అన్నగారు చూడడానికి వచ్చాడు. "మీ బావగారి ఆఫీసుకు వెళ్ళన్నయ్యా .. కాలక్షేపంగా వుంటుంది"

ఆనందం గతుక్కుమన్నాడు. బావమరదిని అక్కడా అక్కడా తిప్పాడు. ఇంటికి తీసుకువచ్చాడు.

"తీసుకెళ్లారా అన్నయ్యా!" రహస్యంగా అడిగింది.

"స్ట్రయిక్‌టమ్మా. ఎవరూ లేరట!"

మనోరమ సందేహం తీరిపోయింది. తన భర్త ఉద్యోగికాదు.

ప్రొద్దుటే ఆమె అన్నగారు వెళ్ళిపోయాడు. "మనం ఒకచోటకి వెళుతున్నాం ... రండి.... యిక్కడ చెప్పను. సస్పెన్స్!" అంది.

ఆటో దిగి యిదరూ నడవసాగేరు.

"ఎక్కడికి మనో."

"అదిగో అక్కడిదాకా!" వేలెత్తి చూపింది.

అది జైలు. ఇక్కడికి ఎందుకు తీసుకు వచ్చిందో అర్థం కాలేదు. "పోదామా!" అంది. తలూపాడు. ఇద్దరూ బయలుదేరారు ఆమె ప్రవర్తన చాలా ఆశ్చర్యంగా వుంది.

"ఇప్పుడంటే మీరు వెంటనే వచ్చేస్తున్నారు. ఒకనాడు ఇక్కడే వుండిపోవల్సి వస్తుంది. ఆ పరిస్థితి వస్తే నేను ఎండ్రిన్ త్రాగుతాను సో.... శవాలంకరణ వద్దు.... కూలి పని నా భర్త చేస్తున్నాడని సగర్వంగా చెప్పుకోగలను. ఇప్పుడు దొంగ భార్యని. రేపు దొంగ తల్లిని...."

ఆనందం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "స్టాప్, ఐ విల్‌స్టాప్ దిస్."

---

# రూపా రూపాలు



ఇంద్రగంటి జానకీబాల

నేను బస్సు స్టాండులో అడుగు పెట్టేసరికి విజయవాడ- గుంటూరు నాన్‌స్టాప్ బస్సు రెడీగా వుంది. రెండు అడుగులు పెగంగా వేసి బస్సు ఎక్కాను. గుమ్మంలో అడ్డంగా నుంచున్న ఒకతను "టిక్కెట్టు బుకింగ్‌లో తీసుకోవాలండి" అన్నాడు.

నేను అతనికేసి చూశాను. ఆ చూపులో నిరసన మెరిసే వుంటుంది. కారణం- నా జేబులో వున్న వారంటు. నేను ఆర్. టి. సి. ఉద్యోగిని.

"స్టాఫ్" అన్నాను అతనేమీ మాట్లాడలేదు. కిటికీ పక్కన సీటులో సర్దుకుని కూర్చున్నాను. జనం ఎక్కువగా లేకపోవడంవల్ల ఒక్కొక్కరేవచ్చి నచ్చిన సీటు చూసుకుని కూర్చుంటున్నారు.

నేను సన్నగా, పొట్టిగా వుండడంవల్ల చాలామంది నన్ను కుర్రాడనే అనుకుంటారు. వాళ్ళు అలా అనుకోవడం నాకేమీ బాధగావుండదు ఆనందంగానే వుంటుంది. నేను ఎకవుంటెంట్ హోదాలో వున్నానని గాని, బలమైన యూనియన్‌కి పట్టుకొమ్మలాంటి నాయకుననిగాని నన్ను చూసి ఎవ్వరూ అనుకోరు. మా ఆఫీసర్ నన్ను 'బోయ్' అని వ్యవహరించినపుడు నాకెంతో ఆనందంగా వుంటుంది. ఆఫీసులో ప్రతీవాడూ 'పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు' 'పిట్ట కొంచెం కూతఘనం' వగైరా మాటలతో ఎగతాళి చేస్తుంటే అది నా ప్రతిభకి గుర్తింపు అనిపిస్తుంది.

ఎవరేమనుకున్నా నా పనే నాకు. మరో విషయం పట్టించుకోను.

డ్రైవరు ఎక్కాడు ఎస్. ఆర్. తీసుకుని టిక్కెట్లు లెక్కపెట్టుకోవడం మొదలుపెట్టాడు.

అతన్నిచూసి నాకు గుండెఝల్లుమంది ఎందుకో భయమేసింది. నల్లగా, ఆరడుగుల ఎత్తుమనిషి- మూతిమీద మూరెడు గుబురు మీసం అతని ఆకారాన్ని మరింత భయంకరంగా చేస్తోంది.సినిమాల్లో మేకప్ చేసిన గూండాలా యెడం చెంపమీద కత్తిగాటు,నుదుటిమీద కుడివైపు నల్లని మచ్చ.

అతని రూపం చూసి అతను కుహాకరోక్కటకుడై వుండాలని నేను నిర్ణయించుకున్నాను.

బస్సులో ఎవరైనా టిక్కెట్ తీసు